# కన్యాదానఫలం దక్కుతుందా?

అక్కరాజు ఆంజనేయులుగారు, బి. ఏ.

౧

"పాపా, యాలకులు, తిందానికి పెత్తాలే. మొగుడొద్దూ? కావాలా? పెల్లి చేత్తాలే, యిప్పులే" అంటూ, వచ్చీరానిమాటలతో అదేమిటో ఒకలోకంలో ఉంది కల్యాణి, చందనబొమ్మల్తో ఆడుకొంటూ. తానోక జేనెడు పావడకట్టుకొంది, కూతురు బొమ్మకు చిన్న జల్తారుపేలిక పరికిణీ కట్టింది. "ఎవరు మోత్తారబ్బా, ఈపాలుపావల?" అంటూ ఊడదీసి పారేసి, ఆడుకొంటూంది. చెయ్యాలం పెండ్లి. విందు కావాలా? "అమ్మా బెల్లంపెత్తవూ?" అంది. "ఇప్పుడు కాదమ్మా" అంది పార్వతమ్మ. కల్యాణి బొమ్మ కూతురికే పెండ్లిచెయ్యగా, పార్వతమ్మా భద్రయ్యా నిజం కూతురికి చెయ్యకూడదా? "బెల్లమే" అంటూ ఏడుపు సాగించింది పిల్ల.

నేస్తం కృష్ణావధాని అన్నిశాస్త్రాలూ గాలించాడు. చురుకైనబుద్ధి. పూర్వాచారం నిలపడమే జీవితధర్మంగా భావిస్తున్నాడు. పూర్వాచారంలో కొంచెం లౌక్యం మిళితంజేస్తాడుకూడా. ఇప్పుడేదో పని మీద పోతుండగా భద్రయ్య కేకవేశాడు.

భద్రయ్యకు అరవయ్యోపడి దాటుతుంది. పార్వతమ్మ పదిహేనేండ్లు తక్కువలోఉంది. ఒక పెద్దజవాబుదారీ భద్రయ్యకుండే అణిచేస్తూంది. ఈకాలం ఆయుః ప్రమాణాన్నిబట్టి తాను అరవైయేండ్లు బ్రతకడమే విచిత్రం. అయినా భార్యాభర్తలు గట్టివాళే. ఆయనకు యాభైఅయిదు; ఆమెకు నలభై ప్రాంతంలో కల్యాణి పుట్టింది. ఇక బదకనని పెద్దబెంగపట్టుకొంది భద్రయ్యకు. తాను పోతే కల్యాణిపెండ్లి చేసేదెవరు? ఆపిల్ల పెండ్లిభారం తీరెనా, తన జీవి సుఖంగా పోతుంది. అయితే తనబాధ్యత తీర్చుకోవడమేలాగా? కల్యాణికి పెండ్లి చెయ్యాలి. మూఢాచారంలోగూడా సందిగ్ధాలున్నాయి. 'అష్టవర్షా భవేత్కన్యా' అని ఉంది. కాబట్టీ, కల్యాణికి అయిదేండ్లుకూడా నిండలేదు కాబట్టీ, దాని పెండ్లి కన్యాదానంకింద వస్తుందా, రాదా? అని సందేహం. జీవితంలో ఇక కన్యాదానం చెయ్యబోడు. పార్వతమ్మకు ముట్లుడిగాయి.

మనోవేగానికి మితేమిటి? ఈలా యేమేమో అనుకొంటూండగా, కృష్ణావధాని వచ్చాడు. 'ఏమన్నా! ఎందుకు పిల్చావు? ఏదో పనిమీద వెళుతూంటే' అన్నాడు.

భ—ఊళ్లోవాళ్ల కార్యాలకేకదా? ఎక్కడో పనికిమారు ఇక్కడే అనుకొందూ. వయస్సుచేత నేను పెద్దవాణ్ణయినా, విద్యచేత నీవు. బుద్ధివయను ప్రధానంగాని శరీరంవయస్సు కాదు. అట్లయితే, మనందరికంటే ఆ చింత పెద్దది.

కృ—ఏమిటి? ఎక్కడికో పోతున్నావు?

భ—నాసంగ తెలుసుదువుకదూ. ఎక్కడ మొదలూ?

కృ—'ఎక్కడో పనికిమారు ఇక్కడే అనుకొందూ' అన్నావు.

భ—ఆ, అవును. నేను పెద్దవాణ్ణయినాను. కాట్లో కాళ్లాచుకొని ఉన్నాను.

కృ—అయితే, యిప్పు డేమిటి?

భ—పెద్దవాణ్ణి. అటూయిటూ బుద్ధినిపోనియ్యకుండా ఒక్క విషయంమీదే ఉంచమంటే నాతరమా?

కృ—ఇదంతా ఏంకథకు పీఠిక?

భ—నాతలమీద పెద్దభారముంది. అలా అంటే తర్కానికి దిగుతావు. "నీలాంటివాళ్లు ఎంతమంది పోలేదు? వాళ్ల పిల్లలగతేమైంది? అందరూ చెడ్డారా?" అంటావు. అంతటికీ దేవుడే, మనబాధ్యతఏమిటి అంటావు. పురుష ప్రయత్నమనేది ఉంటేనేకదా, దైవసహాయం?

కృ—అనన్లే, విషయం చెబుదూ; ఏమిటీగొడవ?

భ—కల్యాణికి మూడుముళ్లూ పడినట్టాయెనా, నా ప్రాణి హాయిగాపోతుంది.

కృ—అదా? అయితే పెండ్లిచేసెయ్యి. వరుడున్నాడా?

భ—ఇప్పుడు సందేహమదికాదు. పిల్లకు అయిదో యేడే నిండలేదుగదా, కన్యాదాన మౌతుందా కాదా? కన్యాదానఫలం దక్కుంతుదా? అని.

కృ—ఈమాటకా యింత ఆర్భాటం?

అంటూ కనుబొమలు ముడిచాడు, యీ లౌకికశిఖామణి. చంటిబిడ్డకూడా పెండ్లి చెయ్యొచ్చునని ఎక్కడా ఒక్క శ్లోకమూ కనబడదు. నాలుగైదు నిమిషాలు అట్టే ఎగజూచాడు.

కృ—అదికాదోయి. శాస్త్రమంటే దేశకాల పాత్రలకు అనుగుణంగా ఉండే ధర్మగ్రంథమే కదూ?

భ—అవును. అయితే?

కృ—వేదకాలాన వందలయేండ్లు ఆయుఃప్రమాణం ఉన్నప్పుడు రజస్వలావివాహాలూ స్వయంవరాలూ జరుగుతుండేవి. ఏ వెయ్యేండ్లక్రిందనో శతాయువులై ఉండగా, రజస్వలావివాహాలు పదహారు పదిహేడేండ్లకు జరుగుతుండేవి. ఇంకా యువతల ఆయుఃప్రమాణం ధ్యే యెనభయ్యో ఉంటూండగా శాస్త్రకారులు 'అష్టవర్షాభవేత్కన్యా' అని యెనిమిదేండ్లకుదించారు. ఇప్పుడు అదీ లేదు. మొన్న ఆంధ్రపత్రికలో మనదేశంలో సరాసరి ఆయుఃప్రమాణం యిరవై మూడేండ్లే అన్నారు. అదే నిజమైతే, లెక్కప్రకారం కన్యాదానవయస్సు రెండేండ్లాచిల్లరకు దించవచ్చు. వచ్చేమిటి? వలె. లేకుంటే మన దేశం అధోగతిపాలే.

భ—నిజంగా నీ అభిప్రాయమంతేనా?

కృ—ముమ్మాటికీ.

భ—బుద్ధికి బృహస్పతివోయి! అయితే కన్యాదానఫలం తప్పదుకదా?

కృ—ఇక ఆలస్యం చేసేకొద్దీ అసాధ్య మౌతుంది కూడాను. వదినా, వెళతా.

పార్వతమ్మ—మంచిది, బావా.

ఇంతవరకూ బొమ్మలపెండ్లి భోజనాలకు బెల్లం కోసం యేడుస్తూఉన్న కల్యాణి ఓదార్చడంలో ఉంది పార్వతమ్మ. రెండుచేతులూచాచి, చిన్నరొమ్మువెనక్కు విరుస్తూ, 'అంతబెల్లం కావాలి' అంది కల్యాణి. అంత కాదు యింతకాదు, చాచిన రెండుచేతులంత కావాలట ఎక్కడ తేవడం? ఆ ఉపాయం తల్లులకే తెలుస్తుంది. ఉసిరికాయంత ఒకటీ నిమ్మకాయంత ఒకటీ రెండుండలు చెరొకచేతా పట్టి ఏదికావాలని అడగ్గా, నిమ్మకాయంతదాన్ని నవ్వుతూ ఎగిరందుకొని, మళ్లీ తన గొడవలోకి వెళ్లింది కల్యాణి. పార్వతమ్మ పిల్లను సముదాయించి వచ్చేసకి, 'వదినా, వెళతా' నన్నాడు కృష్ణావధాని.

'కన్యాదానఫలం దక్కుతుందటో' అన్నాడు భద్రయ్య. పార్వతమ్మ 'ఎలాగా?' అనగా, ఉపాయం చెప్పాడు.

౨

ఇంతవరకూ భద్రయ్యచేసిన వ్యవహారం రాముడు లేని రామాయణం. పెండ్లికొడు కేడీ?

భద్రయ్యసంసారం మెరుగైందే. ఎన్నిపాపాలో చేశాడు. పాపమెక్కువయ్యేకొద్దీ మూఢభక్తియెక్కువ. అట్లని మూఢభక్తికలవాళ్లంతా ఎక్కువపాపం చేశారనడంకాదు సుమీ. పాపం మనసు పీకుతూండబట్టే శాస్త్రాల్లోచెప్పినట్లు కన్యాదానఫలితానికి వెదకడం.

అల్లుడు యింగ్లీషు చదువుకొన్నవాడుగా ఉండాలి. లేకుంటే, పదిమందిలో తనపిల్లకే తలవంపులు. అందుకోసం భద్రయ్యకాలేజీలు వెదక మొదలుపెట్టాడు. 'మాతావిత్తం' అన్నట్లు, పార్వతమ్మ డబ్బుగలవాణ్ణిగా చూడమంది. 'పితాశ్రుతం'— భద్రయ్య చదువుకున్న వాణ్ణికోరుతాడు. భార్యాభర్తల అభిప్రాయాలు అన్యోన్యానుకూలంగా ఉంటేనేగాని, సంసారం సాఫీగా

జరగదు. విద్యాధనాలు రెండూఉండేవాడు దొరకడమే కొంచెం కష్టం. ఇక, కల్యాణే పెద్దదై ఉంటే, 'కన్యా వరయతేరూపం'అన్నట్లు, అందగాణ్ణి కోరే ఉంటే, యీ పెండ్లి అయ్యే ఉండదు. ఇదేకాదు, యీవరుస మీదనే అయితే ప్రపంచం గార్హస్థ్యధర్మంమీద నడు వడం అసాధ్యమే; మరోవిధంగా నడువవలసి ఉంటుంది. కాని, పిల్ల కంఠజ్ఞానం రాని స్తేగదా?

తిరిగి తిరిగి విజయనగరంకాలేజికి వచ్చాడు భద్రయ్య. సాధారణంగా కాలేజీలలో వరుణ్ణివెదికేవారు, మంచి అయ్యవార్ని ఎవర్నో పట్టుకొని, ఆయనద్వారా మంచిపిల్లవాణ్ణి యేరుకోవడం సాధారణం. కాని కాలం మారిపోతూఉంది. నాలుగైదేళ్ల పిల్లకు ఏరుడుకావాలని హెచ్చరిస్తే, యీమాత్రం ఆమాత్రం జ్ఞానమున్నవారెవ రైనా చీవాట్లువేస్తారు. ప్రపంచజ్ఞానంగలవాళ్లు సాధా రణంగా కాలేజీ బ్రహ్మచార్లకు అనాఘ్రాత పుష్పం లాంటిపిల్లను కట్టడానికి కొంచెం అనుమానిస్తారు. కాని ఆ అనుమానం భద్రయ్యకు లేదు, ఎక్కడా వినలేదు. తానెరిగిందొకటి, శైశవవివాహం సమ్మతించరు నవనాగ రకులని.

ఇందుకనే,భద్రయ్యకొత్తయుక్తిఒకటిపన్నాడు, కాళయుక్తి. సోదెమ్మహోటల్లో భోజనం చెయ్యడం, అరుగుమీద కూర్చోడం, పుస్తకాలు చేతపట్టుకొని కాలేజికి వెళ్లేవాళ్లని చూస్తూఉండడం. కాలేజి విడిచే వేళకు మళ్లీ ఆలాగే చూస్తూఉండడం.

మూడునాలుగురోజులు గడిచింది. ఒకదినం సాయంత్రం చేత పుస్తకాలతో, ఒకయువకుడు తెలుపు కలిసిన యెరుపుచాయతో, రివటలాగా సన్ననిపొడుగరి, సేలంజల్తారుదోవతి, కండువా, సిల్కుచొక్కా వేసుకొని కండ్లకు అద్దాలూ కాళ్లకు స్లిప్పర్లూ వేసి, ఠీవిగా, అనో పయోగంతో, కొనకంట అటూయిటూ గుమ్మాలవైపు చూస్తూ, భద్రయ్యముందరగా వెళ్లుతున్నాడు.

బ్రతికానను కొన్నాడు భద్రయ్య. అతనివెనకే కదిలాడు. ఆ కుర్రవాడూ ఆవీధిలోగుండా యీవీధిలో గుండాతిరిగి 'అసావాదితో బ్రహ్మ' అన్నట్లు చివరకు కానుకుర్తివారివీధిలో ఒకబసలో ప్రవేశించాడు. బల్ల మీద పుస్తకాలు పడేసి, వాలుకుర్చీలో కూర్చొని, ఎక్కణ్ణో మనసు పెట్టుకొని, జపాను విసనకర్రతో మెడ గుండీతీసి గుండెపై విసురుకొంటూఉండగా, భద్రయ్య ప్రవేశించాడు. వయసుమీరినబ్రాహ్మణ్ణి చూడగానే, ఎంత యింగ్లీషుచదువుకొన్నా, కుర్చీచేతులపై కాళ్లు దించి, 'ఎవరండీ' అన్నాడా యువకుడు. 'మీతోప నుండి వచ్చానండీ' అని సగౌరవంగా ఉత్తరమిచ్చాడు భద్రయ్య. అతను 'దయచెయ్యండి' అంటూ, ఇంకొక కుర్చీ యిచ్చి, భద్రయ్య కూర్చోగా, 'ఏమిసెలవు' అన్నాడు.

భ—కొంచెంశాంతంగా మాట్లాడవలసినవిషయం. అడగడానికి మరచాను, తమ పేరేమి?

యు—గోపాల మంటారు.

భ—ఇంటిపేరు?

గో—పసుమర్తివారు.

భ—నావల్ల ఆలస్యం అవుతూందేమో, షికారుకు?

గోపాలానికి ఆలస్యమేమిటి? సత్రానికివెళ్లి భోజ నంచేసి,తర్వాత సినీమాకువెళ్లి, అక్కణ్ణుంచిగుడివీధికివెళ్లి యేఅర్ధరాత్రికో పడకకు బసకు వచ్చేయేర్పాటు ఆలోచి స్తుండగా, భద్రయ్యవచ్చాడు. వచ్చింది పెద్దబ్రాహ్మడు, ఇంటిపేరు అడిగాడు. కారణమేమైయుండునో కాలేజీ కుర్రవాళ్లకు చెప్పాలా? 'మీవల్ల ఆలస్యం ఏమీ లేదండీ' అన్నాడు గోపాలం.

భ—ఏపదిగంటలకు తిన్నా అన్నమో, కాఫీ హోటలుకు వెళ్లి ఫలహారం చేసి వచ్చికూర్చుంటే బాగుం డును. శాంతంగా మాట్లాడవచ్చు.

'ఊరక రారు మహాత్ములు' అన్నారు. ఇదిమూ ఢీగా పెండ్లిప్రయత్నమే. వచ్చినవాడు పూర్వాచార పరాయణుడుగా ఉన్నాడు. తాను మంచి అలవాట్లు కలవాడుగా కనబడాలి.

గో—ఈపూటకూలితిండి అనాచారానికే తల ప్రాణం తోకొక్కొస్తూంటే, కాఫీహోటేలుఫలహార మే?

పూటకూలియింట, వంటగదిలో ఎవరు వండినా, వడ్డించేదన్నా బ్రాహ్మణమనిషి. కాఫీహోటల్లో అదీలేదూ. సెలవుల్లో యింటికి వెళ్లితే మా అమ్మ కొత్త జంఝుం వేయించి పెట్టెలూ బట్టలూ అన్నీ తడిపించి మరీ విస్తరి ముందు కూర్చోనిస్తుంది.

భ—ఆఁ! ఏవూరు బాబూ?

గో—గోదావరిజిల్లా అమలాపురం.

భద్రయ్యకు కన్యాదానానికి పవిత్రమైన కుర్రవాడు దొరికాడన్న సంతోషానికి మితిలేదు. పాపాలన్నీ యీకన్యాదానంతో సరి, జన్మతరించిం దనుకొన్నాడు.

భ—అమ్మా నాయనా ఉన్నారా?

గో—నాయన చిన్నప్పుడే పోయాడు. అమ్మ పెద్దది. ఆచారం లావు.

భ—ఆమె ఒక్కర్తే ఉందా?

గో—మాతమ్ముడు సుందర మున్నాడు.

కల్యాణి కాపరానికొచ్చేసరికి అత్తఉండనే ఉండదు. ఇక ఆడబిడ్డల పోరో? అందుకోసమే భద్రయ్య 'అక్కచెల్లెం డ్లున్నారా?' అని ప్రశ్నించాడు.

గో—లేరు. అన్నదమ్ముల మిద్దర మే.

భ—(ఆతురతతో) నాయనా, గోపాలం, ఒక కార్యముండి వచ్చాను.

గో—చెప్పకుండానే తెలుస్తూంది. అయినా, చెప్పండి.

భ—పెద్దవాణ్ణయినాను, చాలకాలంలేదు. నా జన్మకు ఆఖరు కన్యాదానం చెయ్యాదలచాను.

గో—అయితే యిప్పుడే పెండ్లిచేసుకొంటేనా చదువు చెడుతుంది. పెద్దపెద్ద ప్లానమీద ఉన్నాను. ఏలాగా?

భ—నీకేమీ యిబ్బందిలేదు. పిల్లకు ఇంతా అయిదో యేడే. వెయిన్నీనూటపదహార్లతో సాలంకృత కన్యాదానం చేసుకొంటా. ఖర్చులునావే. నీవు ఊఁ అని మూడుముళ్లూ వేసి వస్తే చాలు.

గో—చదువు చెడుతుంది. మాప్రయత్నం ఏవీ వద్దన్నా మీఊరికి రాకపోకలకే కొంతకాలం అవుతుందా?

భ—అంశమాత్రమూ లేకుండా పెండ్లియెలాగా?

గో—కల్యాణికి యెన్నేండ్లన్నారు ?

భ—అయిదోయేడు.

గో—ఆమాట కొంచెం ధైర్యమిస్తూఉంది. ఏ యేడెనిమిదేండ్లకో కాపరానికొచ్చేసరికి నాప్లానన్నీ కొనసాగుతాయి. అయితే ఒకమాట ఉంది. ఎంతకల్ల సంసారమైనా, కొండైనా ఒక్కోరాయి తీస్తుంటే తరుగుతుందన్నారు గదా? ఇక నాసంగతో, రాళ్లుతియ్యడంగాదు, గుండ్లుతియ్యడం, మీరూ ఒకచెయ్యి వెయ్యవలసిఉంటుంది. ఒకటికాదు, రెండుచెయ్యాలి.

భ—కానీ, ఏమైనా, నీఅంతటివాడు అల్లుడైతే, అంతేచాలు.

ఇలా మాట్లాడుతూండేసరికి భోజనాలవేళైంది. గోపాలం కాబోయ్యే మామగారితో హోటలుకు వెళ్లాడు, 'ఆలస్యా దమృతం విషం' భద్రయ్య ఆరాత్రికే ప్రయాణమైనాడు. మామగార్ని బండెక్కించి, చిల్లరఖర్చు కని ఆయన యిచ్చినయాభై రూపాయలతో సానివీధి చేరాడు అల్లుడు.

భద్రయ్యసంతోషానికి మేర లేదు. చూడను బాగున్నాడు. మంచివంశం, మంచిఆచారం, చదువులో శ్రద్ధ, కల్లసంసారం—ఇకేంగావాలి? కల్యాణి అదృష్టం! గోపాలం ముదర బెండకాయన్న సంగతి తనకేందెలుసు?

కల్యాణి దదోలోకం. పీటలమీద తన బొమ్మలకూడా తనతోపాటుఅన్నీ, మంగళసూత్రంతోగూడా. బాజాలు, బూరెలు దొరికాయి, బొమ్మ లున్నాయి. ఇకేమీ!

ఏలాగైతేనేమి, పెండ్లయింది. డబ్బుచేతికొచ్చింది. చదువంటే అతిశ్రద్ధ కాబట్టి, పదహారురోజుల పండగకు కూడా ఉంచుకోకుండా అత్తమామలు గోపాలాన్ని ప్రయాణం జేశారు.

'నా బరువు తొలిగించవ్వా' అనుకొన్నాడు భద్రయ్య.

గోపాలం వెళ్ళేనకకూడా, కల్యాణి రోజూ పారాణించుకొని, పెండ్లిచేసుకొనేది. తోడిపిల్లలచేతికి మంగళసూత్రం తీసిచ్చి, తాటాకుపీకలతో వాళ్లు బాజాలు ఊత్తుంటే, తాను మంగళసూత్రం కట్టించుకొనేది. అమ్మా నాయనా చూచదంటే యేడుస్తుంది. ఏడ్పించడానికి మనస్కరించక వాళ్ళూ ఊరుకొనేవారు.

## 3

పెండ్లి కాకముందు గోపాలంజీవిత మున్నట్లు ఇప్పుడు లేదు. చాలా మార్పు కలిగింది.

మొదట కాలేజీలో ప్రవేశించగానే సత్రంలో పద్దు వేయించుకొన్నాడు. పద్దుల్లకలిగే సౌఖ్యాల కోసమై ఒకనాట్కిశమకు ఓర్చుకొన్నాడు. ప్రిన్సిపాలు బోర్డింగుకావలసిన విద్యార్థుల విచారణచేసేదినం కొంచెం అలంకారం మాని పాతచొక్కాయితొడిగి లేని వంగి మాటలతో ఆ అయిదునిమిషాలూ గడిపాడు. వారంతిరిగేసరికి సత్రంగుమాస్తా పద్దుపడిందని చెప్పాడు. ఇక సత్రంలో భోజనం చెయ్యడం, ఇంటినించి హోటలుకని వచ్చిన డబ్బుతో రాత్రి ఖర్చుపెట్టుకోడం.

విద్యార్థిసత్రం భోజనమంటే మనుషులు తినవలసిందికాదు నిజమేగాని, అందువల్ల మిగిలేడబ్బువల్ల కలిగేసుఖంముందర యీభోజనకష్టం తెలిసేదికాదు. ఏమినాయనా చిక్కిపోతున్నావని యింటికి వెళ్లినప్పుడడిగితే, బి, ఏ. చదువూ, పూటకూలితిండీ, అనేవాడు.

ఇదివరకు మనియార్డరువచ్చిన రెండుమూడు రోజులే టెంపరరీగా గృహస్థుకావడం. ఇప్పుడో, కావలసినంత డబ్బుండడంచేత నిత్యగార్హస్థ్యం.

పరీక్షలయిపోయాయి. గోపాలం ఇంటికిగానీ, మామగారియింటికిగానీ వెళ్లడు. ఏమని యింటికి వ్రాశాడంటే, 'బి. ఏ. పరీక్షవిషయంలో సందేహంలేదు. తర్వాత చదువుకు ఇక్కడనే ఉండి వేసవిలో చదువుకోవాలనిఉంది' అని. చదువుసంగతి ముసలిముండ అమ్మకు తెలుసునా? వెఱ్ఱికుట్టి మామకు తెలుసునా? ఏమో పెద్దపరీక్షలు ప్యాసయి ఉద్యోగాలూ ఊళ్లూ యేల్తాడు గోపాలం అని వాళ్ల విశ్వాసం.

పరీక్షాఫలితాలు వచ్చాయి. అందరూ పోస్టాఫీసుకు వెళ్లుతూంటే, తాను గుడిపీథికి వెళ్లుతున్నాడు. తన పరీక్షనుగురించి అనుమానం ఉంటేకదూ? జీవనం మాత్రం మహాతీవ్రంగా నడుపుతున్నాడు. బాంకిలో మొత్తం నెలనెలకూ తగ్గుతూఉంది; ఒంటిలోశక్తి దినదినమూ తగ్గుతూఉంది. వైద్యం ప్రారంభమైంది. పుస్తకాల అరమరనిండా మందుసీసాలు నిండాయి.

విజయనగరంలో వేసవి అంటే తెలుసునా! తెల్లవారేసరికి పక్షులు చచ్చి చెట్లకింద పడతాయి. ఆ యెండేచాలు మనిషిని మాడ్చెయ్యడానికి. గోపాలం తీవ్రజీవనంతో మండేవేడి సంధించింది. ఇంకేమి?

గోపాలానికి చాలా జబ్బు చేసింది. చిన్నప్పుడు అశ్రద్ధచేసినందుకు ... ... ... ... ... ... ... ... ... ... ... స్నేహితులు కనిపెట్టారు. పూటకూలితిండికీ, విజయనగరంవేడికీ, యీవ్యాధులకూ, గోపాలం క్షణక్షణం క్షీణమౌతున్నాడు. అదిచూచి అందరూ ఊరికి వెళ్లమన్నారు. తెల్లవార్లూ మొర్రోమని గోలపెట్టడం చూచి స్నేహితుడొకడు, గోపాలానికి ఒళ్లు తెలియకుండా ఉన్నప్పుడు, తెలివితో మాట వినడని, చెప్పకుండా తీసుకవెళ్లి ఊరు చేర్చాడు. తల్లీ తమ్ముడూ అప్పుడు మేలుకొన్నారు.

ఒకనాడు బతుకుతాడా అన్నంత జబ్బుచేసింది. భద్రయ్యకు మైలు రుసుం గట్టి తంతికొట్టారు.

ప్రాణం పోయింది. అత్తా మామా వచ్చేదాకా దహనంచెయ్యడమెలాగా? ప్రాణం పొద్దున పోయింది. సాయంత్రానికి గోలపెడుతూ పార్వతమ్మవచ్చి కల్యాణిని శవంమీదవేసింది. భద్రయ్య ఎట్లయినా మొగవాడుకాబట్టి గోలపెట్టడంలేదు. ఒక్కపెట్టున అందరూ గోలుమనే టప్పటికి కల్యాణి 'బా' అని పార్వతమ్మమెడ

కరుచుకొంది. 'నిర్భాగ్యపుకండా, నీగతి తెల్లవారిందే' అని అమ్మ పిల్లపైనబడి యేడుస్తుంది.

దహనమైంది. ఇల్లు బావురు మంటూంది. "ఈ పుట్టువెతన కెందు కిచ్చానే నాబంగారు నాయన్నా?" అంటూ పిల్లను చూచి అత్త యేడుస్తుంది. ఏమన్నా, ఆడపిల్ల తల్లి కాబట్టి, పార్వతమ్మ బనులాడలేకపోతూంది. లక్ష్మిలా ఉండవలసినపిల్లను యీగతి పట్టించి ఎలాబతికి నన్నాళ్ళూ కడుపున పెట్టుకొనివేగడమా అని బహుళ్ళాగా నిరామయంగా ఉన్నహృదయంతో ఉండేపార్వతమ్మకు ఎత్తిపొడుపుమాటలుకూడాను.

కర్మ దానిపాటికది జరుగుతూంది. ఆఖర్నాడు కల్యాణ్ని శేవుకుతీసుకెళ్లాలి; కనబడక వెతుకుతున్నారు. కల్యాణి ఎక్కడ ఆడుకొంటూంటుందో అని మామూలు చోట్లల్లా చూస్తున్నారు. ఒకరు పెరట్లోకి వచ్చేసరికి ఒకమూలను ఎవర్ని చూడడం? బొమ్మలు పెట్టుకొని పారాణించుకొని పక్కింటిపిల్లతో పెండ్లి ఆట ఆడుకొనే కల్యాణిని. అతని మన సెటుపోయిందో గదా? నోట మాటరాదు, గుండె జారిపోయినట్టయింది. ఒకమూలను తాను కూర్చొన్నాడు. "అమ్మాయీ, అగ్గయిపోయిన అమ్మాయీ," అని అణిగిపోతూ ఉన్న అమ్మకేక విన బడ్డది. 'ఇక్కల ఆటుకొంతున్నా'అని కల్యాణి అరి చింది. అమ్మ వచ్చేసరికి, చప్పట్లు కొట్టుకొంటూ నవ్వుతూ, మొగమెత్తుకొని ఎదురుపోయింది. 'అవ్వ'ని నోరు కొట్టుకొంటూ, గుండె బాదుకొంటూ కొంగుతో పారాణి తుడిచి, పిల్లను చంకబెట్టుకొని వెళ్లింది.

బంగారు గాజు లుంచారు. మాంగళ్యం తియ్యబోతే కోతిపిడికిలి పడుతుంది కల్యాణి; ఏడుస్తుంది. ఏమనడం? తినడానికి మిఠాయి తెప్పించిపెట్టి, మోసంచేత తాడు వెనకనుంచి కత్తిరించేశారు.

౪

కల్యాణిది తెలిసినయేడుపూకాదు, తెలేనియేడుపూకాదు. నోములునోచినపిల్లలు దారినపోతుంటే చూచి, తానూ నోచుకొంటాననటుంది. కూతురికి తెలేని విచారం నెత్తిన పులుముపలసివచ్చింది. పిల్ల సంగతి ఆలోచించే, పార్వతమ్మ యెవరినీ తనకు బొట్టుపెట్టడానికి రావద్దని బతిమాలుకొంది.

ఈలాంటివి అనుదినమూ తటస్థిస్తూనే ఉండేవి. ఆడవారిహృదయం మగవారిలాగా ప్రకృతిదూరం కాలేదు కాబట్టి అప్పుడప్పుడూ కల్యాణిదుస్థితి దేవుడు వ్రాసిందా, మనుషులు కల్పించిందా అని లోపలచేరి తన్నెవరో అడిగినట్టు తోచేదిగాని, దానికి జవాబు పార్వతమ్మ చెప్పలేకపోయేది. ఒకపక్క ప్రకృతి తన హృదయానికిగాలంవేసి లాగుతూంది; ఒకపక్క మనుష్య కల్పితమై ప్రకృతి విరుద్ధమైన సాంఘికాచారం భద్రయ్యగా మూర్తీభవించి తనను అణగదొక్కుతూ ఉంది.

కల్యాణిని భరించడం గుండెమీద కుంపటి పెట్టినట్టుంది.

పిల్లకు యేటిమీద యేడు పడింది. అడవిలో పువ్వుపూచినట్టు పుష్పవతి అయింది. ఆసమయంలో మనసులో యేలాంటికోరికలు పుట్టేదీ ఆడవాండ్లకే తెలియాలి. ఇప్పుడిప్పుడే కల్యాణికి తాను అయిదోతనంలేనిదనీ, తన పుష్పవతీత్వం అందరికీ విచారకరమేగాని సంతోషకరం గాదనీ, బోధపడుతూఉంది.

అన్నివిధాలా బాగుంటే అందరూ గౌరవిస్తారు. కష్టములపాలైనప్పుడు లోకమంతా కఠినంగా, చులకనగా, నీచంగా చూస్తారు ఇటువంటిసంఘాన్ని దీని ఆచారాలను ఎవరు ఎందుకు గౌరవించి శిరసావహించాలో, బోధపడదు.

ఎదటింటిసుందరం, పక్కింటిరాధ చేసుకొన్న పుణ్యమేమి? తానుచేసిన పాపమేమి? వాళ్లుమొగుళ్లతో హాస్యాలాడుకొంటూ, నవ్వుతూ పేల్తూ, మహాలక్ష్మల్లాగా కలకలలాడుతూ, హాయిగా కాలంగడుపుతున్నారు. వాళ్లనందరూ మర్యాదగా, ముద్దుగా చూస్తున్నారు. ఇక తన సంగతో? పూర్వాచారప్రియుడు భద్రయ్య. చుట్టపక్కాలంతా మూడోచేతివారు. ఎవరెక్కడికి పోతున్నా, కల్యాణి ఎదురైతే వెనక్కుపోతారు. మరీ గట్టిమనసు వారైరా, "ఎదురైం

దిరా, పాడుముండ" అని కల్యాణికి వినబడేటట్టుగా గొణుగుతారు. ఆ సణుగు వినబడ్డప్పుడు, తానొక నీచప్రాణిగా పశువులకంటే అధమంగా లోకానికి తోస్తున్నట్టూ, అందుకు తాను చేసిన తప్పేమో అనీ అనుకొనేది. ఇటువంటి ప్రశ్నలు తోచేవే కాని, వాటికి ఏదో ఒక జవాబు ఇదమిత్థమని తేల్చుకోలేకపోయేది. ఇక యింట్లో, పార్వతమ్మకు ఎప్పుడైనా జ్వరమో, తలనొప్పో వస్తే, కల్యాణి తలకు స్నానంజేసి తడిగుడ్డతో వండి వడ్డిస్తేనేగాని నాన్న ముట్టుకోడు. ఒకటి రెణ్ణాళ్లు యిలా చేసేటప్పటికి తలనొప్పి జ్వరం అంటుకొనేవి.

హా! లోకమా! ఎక్కే మనిషికి సాయంచేస్తావు; తనతప్పేమీ లేకనే పట్టుతప్పి పడేమనిషిని తన్నితన్ని అణుక్కతోస్తావు!

రోజు యుగంగా కల్యాణి కాలం గడుపుతూ ఉంది.

పురుషులవిషయంలో కూడా చెప్పవలసి ఉంది కాబట్టీ, గృహస్థులకు కూడా ఒకవిధమైన లింగశుద్ధి ఉంది కాబట్టి, పాతివ్రత్యం అన వీలులేదు, బ్రహ్మరచ్య మందాము. స్త్రీలవిషయంలో మాత్రం పవిత్రతో, పవిత్రతో అని ఆర్భాటం చేస్తాము. మొత్తం మీద ఒక స్త్రీ చెడిందంటే ఒక పురుషుడూ చెడవలెగదా? అదే మంటే మగవాళ్లకు తప్పులేదంటారు. వారు చెడకుండా వీరు చెడడమెలాగా? ఒకపెళ్లితో ఒకభార్యతో పురుషుడికి తృప్తిలేనప్పుడు, ఒకపెండ్లిసౌఖ్యమైనా లేకండా స్త్రీకి తృప్తి ఉండడమెలాగా? ఆలా ఎందుకుండాలి? వాళ్లను పవిత్రంగా ఉండమని మగవాళ్లు పశువుల్లా ప్రవర్తిస్తూ ఉంటే సంఘం చక్కబడుతుందా? నిజంలో ప్రపంచమిలా ఉండడం ధర్మాలు తెలేకకాదు; చెప్పినప్రకారం చేసి దారి చూపేవారు లేక. మరోసంగతి. అన్నీ ఉడిగి అడవులకు పోయిన బడుగుమును లెప్పుడో వ్రాసినప్రకారం యిప్పుడూ జరగమంటే సాధ్యమా? అందరము ఉప్పూ కారం తినేవాళ్లమే. కామమనేద్ది దేవుడు పెట్టాడు. ఏమాత్రమూ సంతుష్టిలేకుండా దాన్ని ఆద్యంతాలూ అణచమంటే సామాన్యులకు సాధ్యంగాదు. కేవలము భోగవాంఛ పాప మనలేముగదా! పాపమే అయితే గార్హస్థ్యమే అశాస్త్రీయం. కాబట్టి జన్మసిద్ధమైన, పవిత్రమైన యీ కోరిక తీర్చుకోడానికి ప్రతిమనిషికీ ఒకమారు అవకాశం యివ్వడం ధర్మం. ఏమిటయ్యా యీ పాదిరిగుడిబోధ అంటారా? వస్తున్నా.

పుష్పవతి అయి ఏణ్ణర్థం గడిచింది. స్త్రీలవిషయంలో సంభోగవాంఛను ఒక అలకు పోల్చవచ్చు. ఇందులో రెండురకాలు. ఒకటి యుక్తవయస్సుతో ప్రారంభమై ఇరవై మూడు, యిరవై నాలుగుకు పూర్తిగా ఉబికి అంతట క్రమక్రమంగా తగ్గి ముప్పైకి సమసి, మళ్లీ యే ముప్పైయెనిమిదిలో పుట్టి ఉబికి నలభైరెండుమూటికి చచ్చిపోతుంది. రెండోది, ప్రతినెలా నెలమూడురోజులకు మూడునాలుగురోజులు ముందుపుట్టి అంతట యెనిమిది తొమ్మిదోనాటికి మహత్తరంగా ఉబికి దేహమంతా వ్యాపించి, చూస్తే గగుర్పాటయ్యేటట్టుచేసి, అంతట పదిహేను పదహారోనాటికి సమసిపోతుంది. మనిషి మనిషికీ కొంచెము ఈయీ కాలనిర్ణయంలో మార్పుండవచ్చు.

ఈలా ప్రతినెలలో ఒక పదిహేనురోజులు, ఏమీయెరుగని కల్యాణికి, ఒంట్లోయేమిటో ఒక వర్ణించరాని కోరిక కలిగినట్టూ, ఒక పొంగువచ్చినట్టూతోచేది. మనస్సేదో ఒకవిధంగా ఉండేది. ఇతరుల భయానికే గాని, అందమైనవాళ్లను చూస్తే ఏదో ఒకవిధంగా ఉండేది. ఈ ఉద్రేకం యేమిటో తనకేమీ బోధపడడం లేదు.

ఇప్పటికి పార్వతమ్మ కావలికాయడం తగ్గింది.

ఏకాంతవాసం యోగాభ్యాసకులకు అవసరమూ, యిష్టమూ, కావాలని తెచ్చిపెట్టుకొనేది కాబట్టి మేలు చేస్తుంది. కాని బలవంతమాఘస్నానంలాగా తెచ్చిపులిమితే భరించడం కష్టం. మనిషిని సాంఘికపశువన్నారు. తోటివాళ్లు ఆడుతూపాడుతూ ముస్తాబుచేసుకొని సరదాగా ఆయింటికీ యీయింటికీపోతూ దిగులనేదేమిటో

యెరగకుండా దినాలు క్షణాలుగా గడుపుతుంటే, కల్యాణిస్థితి యేలాఉంది? పాపం తన అమాయికపు నవ్వు నవ్వరాదట! ఎవరితోనూ మాట్లాడరాదట! ఏయింటికీ పోరాదట! పొద్దుపోవడ మేలాగా! పుస్తకాలతో పొద్దుపుచ్చడానికి చదువురాదు.

చెడ్డహర్గపంటే యేమిటో యెరగనిపిల్లకు పెద్ద వారు ఉపదేశం చేస్తున్నారు. వారాలాంటివారు, వీరు యీలాంటివారు, నవ్వితే ఆ అర్థం, అటుచూస్తే యీ అర్థం, అంటూ, మంచిచెబుతున్నామనే వెఱ్ఱినమ్మకంతో కామశాస్త్రం బోధిస్తున్నారు. చిన్నవాళ్లకు బుద్ధిచెప్పే టప్పుడు, అన్నీ ఉడిగిన పెద్దవారంతా యోగులౌతారు. 'వృద్ధా నారీ పతివ్రతా' అన్నారుగదా. వీళ్లస్వభావాలే పరిశీలిస్తే యెంతఘోరంగా ఉంటాయో వారికే యెరుక, దేవుడికేయెరుక.—అంటే సామాన్యమానవుల సంగతిసుమీ! మానవస్వభావం, చెయ్యొద్దన్నపని, అందులో యేమో ఉంది అని, చెయ్యడం. 'దొంగకరుస్తాడే' అన్నట్టు అవుతుందని గ్రహించేతెలివి భద్రయ్యకేది? పైఅంతస్తు అద్దెకిచ్చాడు. పిల్లలను చెరిచేది తల్లిదండ్రులే అనడంలోనూ కొంతసత్యంఉంది.

తనపై యేండ్లు పడేకొందీ, నాన్నహృదయం క్రూర మౌతున్నట్టు కనబడుతూంది కల్యాణికి. మొదట బుద్ధి చెబుతున్నాననే నమ్మకంతో చెడ్డ ర్లు పిల్లకు తెలేనివి చూపాడు. అంతట కసుర్లూ, దెబ్బలలోకి దిగాడు. కల్యాణి తప్పేమి? ఎవరితోనన్నా మాట్లాడుతూ హాస్యపుమాటవస్తే నవ్వడం. భద్రయ్య ఆనవ్వుకొకఅర్థం అంటగంటి ఒళ్లువిరగ్గొట్టడం. నాతప్పేమంటే నీవందుకు నవ్వావని పాపం ఆరోపించడం. అడ్డంవస్తే పార్వతమ్మకూడా కాయశుద్ధి అవుతూ ఉంటుంది. అనుమానం పుట్టనేకూడదు; పుట్టెనా, సర్వత్రా అనుమానమే.

దేహయాత్ర దుర్భరమౌతూఉంది కల్యాణికి.

౬

భద్రయ్య చెల్లెలు లక్ష్మమ్మను ఆవూళ్లోనే యిచ్చారు. కల్యాణి సమర్తాడినప్పటినుంచీ మేనత్తగారింటికూడా పోరాదని కట్టాయమైంది. ఇన్నాళ్లుగా లక్ష్మమ్మ ఎన్నిమార్లు పిలిచినా కాదంటూ వచ్చారు. కాని, కాలంగడిచేకొద్దీ ఆచారాలేసళ్లుతుండగా ఆజ్ఞలు సళ్లవా? "పిల్ల కుళ్లిపోతూంది, నాలుగునాళ్లు మాయింట్లో ఉంచుకొని పంపుతా" నని భద్రయ్యను ఒప్పించి, కల్యాణిని తీసుకపోయింది మేనత్త.

స్వేచ్ఛ లేకలేక అబ్బితే, దాన్ని సంపూర్ణానుభవంలోకి తేజూడడం మానవస్వభావం. మేనత్తగారింటికి చేరగానే ఆచుట్టుపట్లయిండ్లు చుట్టేస్తూంది కల్యాణి. అందులో; అంతా చుట్టాలే, బీరకాయపీచులాగా; తప్పేమి?

కల్యాణి మరో అత్తగారింటికి పోయింది. లేక లేకరావడం. ఏండ్లకుగా ఒకటిరెణ్ణాళ్లన్నా ఉంచుకోకుండా పంపడం సరిపోతుందా? కాని లక్ష్మమ్మ ఒప్పుకోలేదు. ఆనాటికన్నా ఉండమని ఒప్పించి వచ్చి, పిండివంటకు సామానులు తేవడానికీ, అవిచెయ్యడానికి వస్తువులకూ అటూయిటూ తిరుగుతూంది ఆ అత్త.

కృష్ణయ్యబావ కాలేజి సెలవులకు యింటికొచ్చాడు. బావామరదలూ మాట్లాడుతున్నారు. తనకు బోధపడని సరసాల్లోకి దించి నవ్విస్తున్నాడు బావ. ఏమో ప్రశ్నలు వెయ్యగా యేమో జవాబు లిచ్చింది. ఆప్రశ్నలకూ అర్థంతెలేదు, తనజవాబులకూ అర్థంతెలేదు. అమాయికంగా మాట్లాడుతూ నవ్వుతుండగా బావచెయ్యట్టుకొన్నాడు. ఒళ్లు జల్దరించింది.

*　*　*

అత్త వచ్చింది. అరిశలూ పరమాన్నం చేసింది. మర్నాటికి లడ్డుకు సామాను తయారౌతూంది. లక్ష్మమ్మ యింతప్రయత్నమూ చెరిచి కల్యాణిని పిల్చుకపోరుగదా?

ఆనందంలో మునుగుతున్నారు అమ్మా, కొడుకూ, కోడలూ.

లక్ష్మమ్మ వచ్చి మర్నాటిదాకా ఉండి పది మాత్రలు తానూ వేసుకోని, సాయంత్రానికి కల్యాణిని తీసుకపోయింది.

ఏదోపనిమీదగానిరాని కృష్ణయ్య పిన్నిగారింటికి గంటగంటకూ రాను మొదలుపెట్టాడు. లేనివీ, కల్పించినవీ కాబట్టి, చెప్పేకారణాలు తడికల్లా ఉన్నాయి. 'దీనిభావమేమి తిరుమలేశ,' అనుకొంది లక్ష్మమ్మ. ప్రపంచ మెరగకుండా యీప్రాయాని కొచ్చిందా? మర్నాడుపొద్దునే కోడల్ని తీసుకెళ్లి భద్రయ్యకు ఒప్పగించింది. పైన ఏమున్నా చెబితే పిల్ల ఒళ్లు సున్నంలోకేముక ఉండదని తెలుసు. పులిఉండే గుహలోకి వచ్చిన లేడివిధమైంది కల్యాణిగతి మళ్ళీ.

పక్కింటి బుచ్చమ్మ వచ్చింది, పార్వతమ్మతో మాట్లాడడానికి. పొద్దు కూకింది, పార్వతమ్మ వంటకు వెళ్లింది. బుచ్చమ్మ పిలువగా కలిసి చెంబట్టుకపోడానికి అమ్మనడిగింది. నీళ్ల చెంబుకని బుచ్చమ్మ కల్యాణికూడా తీసుకొని యింటికిపోయి, పని కల్పించుకొని, 'అమ్మా, అమ్మా, ఆగడిలో విత్తళిచెంబు తెవ్వూ?' అని బతిమాలుకొంది.

కల్యాణి తలుపు కొంచెం వెనక్కుతోసి లోపలికి వెళ్లింది. అక్కడ కృష్ణయ్యబావ.

*   *   *

కిట్టనివెనక ఎవడో భద్రయ్యకు చల్లగా అంటించాడు. అందులో మూడోమనిషి వింటూండగా చెబితే మంత్రం బాగా పనిచేస్తుం దని, కృష్ణావధాని యేదో మాట్లాడుతుండగా, క్షేమంగోరి వచ్చినట్టు వచ్చిచెప్పాడు. దానిమీద తర్కం.

కృ—అంత చిన్నపిల్లకు కాలేజీబ్రహ్మచారిని తెచ్చి కడితే ఏమౌతుంది?

భ—దాని కర్మ, నాతప్పా. కన్యాదానం చెయ్యగానే మొగుణ్ణి చావమన్నా రా?

కృ—మొగుడుచచ్చి పిల్లపంచెండడం దాని కర్మమని ఆత్మశాంతిచేసుకొన్నవాడవు, యిప్పుడిట్లా కావడంకూడా దానికర్మే అని అనుకొని ఊరుకోక అగ్గయిపోతా వెందుకూ?

భ—ఏమీ, అప్పుడామాటా, యిప్పుడీమాటా!

కృ—బలవత్తరమైన కర్మఫలం అనుభవిస్తూంటే నీవెవడవోయి మధ్య అడ్డడానికీ, అధికారం చలాయించడానికీని?

భ—ఇదికూడా దానికర్మే.

కృ—శభాష్! కర్మసిద్ధాంత మెంత నీచానికి వచ్చింది. కర్మఫలమా, నీ కన్యాదానఫలమా?

ఇలా అనేటప్పటికి భద్రయ్య అగ్గయిపోయాడు, లేచి వెళ్లా డక్కణ్ణుంచి.

ఈవాసన భద్రయ్యకు కొట్టినట్టు కల్యాణి ఎరగదు.

ఒకనాటిసాయంత్రం యథాప్రకారం కల్యాణి చెంబట్టుకొని వెళ్లగా, భద్రయ్య బుచ్చమ్మగారింటికి వెళ్లాడు. బుచ్చమ్మ వీథితలుపు గడియవేసి, తాను పెరట్లో ఉంది. భద్రయ్య చుట్టుతిరిగి పెరటిగుమ్మంగుండా, బుచ్చమ్మ పోవద్దని అరుస్తున్నా, లోపలికి వెళ్లాడు. ఒకగది తలుపు దగ్గర వేసి ఉంటగా ఒక్క తాపు తన్నాడు. యముడిలాగా వచ్చాడుగాని, కల్యాణి గడగడ వణకుతూ ఒకర్తే ఉంది.

జుట్టుపట్టుకొనివంచి గుద్దుతూ తిడుతూ, బరబర యీడ్చుకొంటూవెళ్లి యింట్లో అరుగుమీదపడేసి, ఒళ్లు తెలేనికోపంలో మోకాలితో గుండెమీద ఒక్క తాపు తాచాడు. 'భోక్కని నెత్తురు కక్కి తెల్లగుడ్లు వేసి ప్రాణం విడిచింది కల్యాణి.

---